# గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఘన స్వాగతం



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్

సిద్దిపేట. ప్రభాతవార్త ప్రతినిధి : జిల్లా కేంద్రంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఎబివిపి 43వ రాష్ట్ర మహాసభలలో పాల్గొనడానికి సోమవారం సిద్దిపేటకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మకు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, జిల్లా ఇంచార్జి సీపీ అకిల్ మహాజన్, ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్ర బోస్‌లు పుష్పగుచ్చాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్బంగా గవర్నర్ తేనేటి విందును స్వీకరించారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

వెల్దుర్తి, డిసెంబర్ 23 ప్రభాతవార్త: వెల్దుర్తి మండల పరిధిలోని రామాయపల్లిలో అప్పుల బాధతో ఒక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. కుటుంబీకులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. రామాయపల్లి గ్రామానికి చెందిన బత్తుల రాజు(40) ఈ నెల 18న వ్యవసాయ పొలంలో రెండు బోర్లను వేయగా చుక్క నీరు రాలేదు. చేసిన అప్పులు తడిసి మోపెడు కావడంతో ఆదివారం రాజు పటేల్ గుంటకట్ట వద్ద ఇప్పచెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో అప్పుల కోసం ఇతరుల వద్దకు వెళ్లడం జరిగిందన్నారు. మృతుడి సోదరుడు మహేష్ కు ఫోన్ చేసి అప్పుల బాధతో నేను చనిపోతున్నానని తెలిపారు. భార్య రేణుక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## క్రైస్తవుల ఆత్మగౌరవాన్ని పెంచుతాం

**రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**హుస్నాబాద్ టౌన్, డిసెంబరు 23, ప్రభాతవార్త :** క్రైస్తవుల ఆత్మగౌరవాన్ని పెంచుతామని రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని లక్ష్మీగార్డెన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదం, క్రైస్తవుల ప్రార్థనలతోనే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి చేసుకుందని, వచ్చే నాలుగు సంవత్సరాలు ప్రభుత్వంలో ప్రజల సమస్యలు తీర్చేందుకు మరిన్ని కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేలా యేసుక్రిస్తు ఆశీర్వాదం ప్రభుత్వంపై ఉండాలన్నారు. క్రైస్తవ మత పెద్దల కోరిక మేరకు వారి ఆత్మగౌరవం మరింత పెరిగేందుకు కృషి చేస్తామని, క్రైస్తవ భవనాలు, అంత్యక్రియలు నిర్వహించేందుకు స్థల సేకరణ చేయాలని ఆర్డీవో రాంమూర్తిని ఆదేశించారు. అనంతరం క్రిస్మస్ కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, వైస్ చైర్మన్ అయిలేని అనిత శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ కొంకటి నళినిరవి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, హుస్నాబాద్ పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులతో పాటు తదితరులు ఉన్నారు.

## సిఎం పర్యటన విజయవంతం చేయాలి

**ఎమ్మెల్యే రోహిత్‌రావు**



సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

**పాపన్నపేట, డిసెంబరు 23, ప్రభాతవార్త:** ఈ నెల 25న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెదక్ పర్యటనకు వస్తున్న సందర్బంగా సిఎం పర్యటన విజయవంతంగా ముగిసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. సోమవారం ఏడుపాయల్లో సిఎం పర్యటనను పురస్కరించుకుని ఏర్పాటు చేస్తున్న పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే రోహిత్‌రావు మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ చేసి బారికేడ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. హెలిప్యాడ్ ప్రదేశాన్ని నిశితంగా పరిశీలించారు.

**పనులను పర్యవేక్షించిన కలెక్టర్...**

ఈ నెల 25న రాష్ట్ర ముఖ్యంత్రి రేవంత్‌రెడ్డి ఏడుపాయల ఆలయ దర్శనానికి వస్తున్న సందర్భాన్ని పురష్కరించుకుని ఆలయ పరిసరాల్లో చేస్తున్న ఏర్పాట్లను సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్‌లు పర్యవేక్షించారు. ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఉన్నారు.

## మాజీ మంత్రి హరీష్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేత



శ్రీ గోద రంగస్వామి వారి ధనుర్మాస మహోత్సవ ఆహ్వాన పత్రికను మాజీ మంత్రి హరీష్ రావుకు అందజేస్తున్న దృశ్యం

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబరు 23 ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం శ్రీ గోద రంగస్వామి వారి ధనుర్మాస మహోత్సవ ఆహ్వాన పత్రికను సోమవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే యం. పద్మ దేవేందర్ రెడ్డిలకు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అధ్యక్షులు కంచి మధుసూదన్ ఆహ్వాన పత్రికను అందజేశారు. అదేవిధంగా జనవరి 10న శుక్రవారం రోజు ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వారా దర్శనానికి రావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి : డీఆర్వో**

**మెదక్ రూరల్, డిసెంబరు 23 ప్రభాతవార్త:** ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని డీఆర్వో భుజంగరావు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్వో భుజంగరావుతో పాటు జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాసరావు, సంబంధిత అధికారులతో కలిసి ప్రజల సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం దరఖాస్తులు 85 రాగా వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ ప్రజల సమస్యలపై వచ్చిన దరఖాస్తులకు ముందు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ సంబంధిత సమస్యలు-35, ఇందిరమ్మ ఇండ్లు-12, పింఛన్-03, ఇతర సమస్యలు-35 దరఖాస్తులు అందాయి. ప్రజావాణి కార్యక్రమంలో ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్న డీఆర్వో భుజంగరావు

# ఏడుపాయల అభివృద్ధికి రేవంత్‌రెడ్డి బాటలు వేసేనా..?

- అమ్మవారిని దర్శించుకునే మొట్టమొదటి సిఎం
- కోట్ల ఆదాయం ఉన్నా అభివృద్ధి శూన్యం
- మాస్టర్ ప్లాన్ కల నెరవేరేనా
- మధ్యలోనే నిలిచిన షటర్‌ల నిర్మాణం
- స్నాన ఘట్టాలు, గదులు లేక మహిళల ఇబ్బందులు





**సంగారెడ్డి బ్యూరో, డిసెంబరు 23 ప్రభాతవార్త:** రాష్ట్రంలోనే ఎంతో ప్రసిద్ధిగాంచి భక్తుల కొంగు బంగారంగా ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వెలుగొందుతోంది. తెలంగాణ రాష్ట్రంలో సమ్మక్క-సారక్కల జాతర తరువాత ఎంతో గొప్పగా నిర్వహించే జాతరలో ఏడుపాయలదే ప్రత్యేక స్థానం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు పక్క రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుండి పెద్దఎత్తున భక్తులు నిత్యం అమ్మవారిని దర్శించుకుంటారు. గత తెలంగాణ ప్రభుత్వం ఏడుపాయల జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించినప్పటికీ మొక్కుబడిగా నిధులు కేటాయిస్తూ మమ అనిపించారు. కోట్ల ఆదాయం ఉన్నా లక్షల్లో వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. నిత్యం వేలాది మంది భక్తులు బసచేసే ఆలయ ప్రాంగణంలో రెండు గెస్ట్‌హౌస్‌లు మినహా దేవాదాయశాఖ కానీ, ప్రభుత్వం కానీ నిర్మించిన ఒక్క వసతి గృహం లేదంటే అతిశయోక్తి కాదు. స్వయంభువుగా వెలిసి భక్తులను నిత్యం కాపాడే వనదుర్గా దేవి ఆలయం ప్రభుత్వాల నిర్లక్ష్యంతో భక్తులకు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి ఉమ్మడి జిల్లాకు చెందిన వారైనప్పటికీ ఏడుపాయల ఆలయాన్ని, అమ్మవారిని దర్శించుకునే ప్రయత్నం చేయలేదు. ఆ దిశగా గత ఎమ్మెల్యే కృషి ఫలించలేదు. ఉమ్మడి రాష్ట్రం మొదలుకొని ఇప్పటి వరకు ఏడుపాయల వనదుర్గా దేవిని దర్శించుకునే మొదటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కానున్నారు. ఈ నెల 25న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడంతో పాటు ఏడుపాయల అమ్మవారిని దర్శించుకునేందుకు సిఎం రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో ఏడుపాయల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తారని భక్తులు ఎదురు చూస్తున్నారు.

**కోట్ల ఆదాయం ఉన్నా అభివృద్ధి శూన్యం...**

నిత్యం భక్తులతో కళకళలాడే ఏడుపాయల దేవస్థానం ఆదాయం గడించడంలోనూ ప్రప్రథమంగానే ఉంది. హుండీ ఆదాయంతో పాటు టెండర్లు, దాతల కానుకల రూపేణ కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ అభివృద్ధి మాత్రం కనిపించడం లేదు. కనీసం మొక్కులు తీర్చుకునేందుకు వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలోనూ ప్రభుత్వం, అధికారులు విఫలమవుతున్నారు. కోట్ల ఆదాయం వస్తున్నప్పటికీ భక్తుల సౌకర్యార్థం బస చేసేందుకు వీలుగా ఒక్క కాటేజీ నిర్మించలేదంటే అధికారుల చిత్తశుద్ధికి నిదర్శనం. అంతేకాకుండా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం లేకపోవడంతో భక్తులు ఎంతో నమ్మకంతో బోనం సమర్పించేందుకు వెళ్లేందుకు సైతం మురికి నీటిని తొక్కుతూనే వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఏడుపాయల ఆలయంలో అతి ముఖ్యమైన ఘట్టం మాగ స్నానాలు ఆచరించడం. దాంతోపాటు సంతాన గుండంలో మహిళలు మొక్కులు మొక్కుకొని తలనీలాలు సమర్పించి స్నానాలు చేస్తుంటారు. కానీ సరైన స్నాన ఘట్టాలు లేకపోవడం, స్నానం ఆచరించిన మహిళలు దుస్తులు మార్చుకోవడానికి గదుల నిర్మాణం చేపట్టకపోవడంతో మహిళా భక్తులు అవస్థలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. ఇప్పటికీ స్నాన ఘట్టాలు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గదులు నిర్మించాలని ఎన్నిసార్లు కోరినా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంపై మహిళా భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గత తెలంగాణ ప్రభుత్వం ఏడుపాయల జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించామని జబ్బలు చర్చుకుందే తప్ప ఆ దిశగా ఎలాంటి అభివృద్ధిని చేయలేదు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడితే ఏడుపాయల అభివృద్ధికి వంద కోట్లు అని నువ్వు పాడి మురిపించావు.. నేను చెప్పి మురిపించాను అన్న చందంగా వంద కోట్ల రూపాయలను కాగితాలకే పరిమితం చేశారు.

**ఏడుపాయల అభివృద్ధికి రేవంత్‌రెడ్డి మొగ్గు చూపేనా...**

ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకునే మొదటి ముఖ్యమంత్రిగా రానున్న రేవంత్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి ఆ దిశగా నిధులు కేటాయించాలని భక్తులు కోరుతున్నారు. ప్రధానంగా ఆలయంలో అభివృద్ధికి గతం లో రూపొందించి మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయాలని, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని, రూ. 3కోట్లతో నిర్మించి మధ్యలోనే నిలిచిన దుకాణా సముదాయాలను పూర్తిచేసేందుకు నిధులను కేటాయించడంతో పాటు గిరి ప్రదిక్షిణకు, స్నాన ఘట్టాలు, గదుల నిర్మాణాలకు, పూర్తి స్థాయి ఆలయ అభివృద్ధికి గతంలో లాగా కాకుండా తక్షణమే 150 కోట్ల రూపాయల నిధులను కేటాయించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. మొదటిసారి ముఖ్యమంత్రిని ఏడుపాయలకు తీసుకురావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అదే పట్టుదలతో నిధులు కేటాయించేలా కృషి చేయాలని కోరుతున్నారు. అమ్మవారిని దర్శించుకునే మొదటి ముఖ్యమంత్రి గతంలోలా మాటలు చెబుతారా, అభివృద్ధికి నిధులు కేటాయిస్తారా అనేది వేచిచూడాల్సి ఉంది.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ క్రాంతి వల్లూరు

## ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలి

**సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**

**సంగారెడ్డి మున్సిపాలిటీ డిసెంబరు 23,(ప్రభాతవార్త):** ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. సోమవారం కల్లెక్టరేట్ సమావేశం సమావేశ మందిరం లో జరిగిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు, అర్జీలు, ప్రజావినతులను, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డిపిఓ సాయిబాబా, డిఆర్ఓ పద్మజరాణితో కలిసి స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం 68 దరఖాస్తులు రాగా, వివిధ శాఖలకు చెందిన అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు పంపించి పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో వారికి తగిన సూచనలు ఇవ్వాల్సిందిగా అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు కోసం జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ డివిజన్లు, వార్డులలో క్షేత్రస్థాయిలో చేపట్టే సర్వే ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా ఈ నెల చివరి వరకు పూర్తి చేయాలనీ స్పెషల్ అధికారులకు ఆదేశించారు. ఎలాంటి వివాదాలు, అవకతవకలకు తావులేకుండా సర్వే ప్రక్రియను నిజాయితీగా, నిబద్ధతతో చేపడుతూ గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశం లో జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు సంఘీభావంగా సమ్మెలో పాల్గొన్న రఘునాథ్, గడ్డం శ్రీనివాస్ తదితరులు

## ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబరు 23 ప్రభాతవార్త:** మెదక్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కొన్ని రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెకు సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్‌తో కలిసి పాల్గొని బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రఘునాథ్ సంఘీభావం తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు రెగ్యులరైజ్ చేయకుండా విద్యను బోధించే ఉపాధ్యాయులను కూడా కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులను తక్షణమే రెగ్యులరైజ్ చేసి వారి న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలి డిమాండ్ చేశారు. అనంతరం రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి ఓటు వేసి కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం కాశీనాథ్, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, లోకేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి

**కొల్చారం, డిసెంబరు 23 ప్రభాతవార్త:** విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం కొల్చారం మండలం సంగాయిపేట గ్రామ శివారులో జరిగింది. గ్రామానికి చెందిన మొకిరే మల్లయ్య వ్యవసాయ పొలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి మోటార్ నడవక పోవడంతో పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫర్మర్ దగ్గరికి మల్లయ్య వచ్చి చూడడం జరిగింది. అప్పుడే పాము ట్రాన్సుఫార్మర్ ఫీజులపై పడి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. అది గమనించి అక్కడి నుండి వెళ్తున్న క్రమంలో కాలు జారీ పడి విద్యుత్ షాక్ తగలడంతో మల్లయ్య అక్కడికక్కడే మృతిచెందాడు.



ఏడుపాయల దుర్గా భవానిమాతను దర్శించుకుంటున్న కమిషనర్, ఆర్జెసిలు

## వనదుర్గమ్మను దర్శించుకున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్

**పాపన్నపేట, డిసెంబరు 23, ప్రభాతవార్త:** పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గ భవాని మాత ఆలయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్‌బాబు, ఆర్జెసి రామకృష్ణ సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న అధికారులను ఈఓ చంద్రశేఖర్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 25వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయాన్ని దర్శించుకునేందుకు వస్తున్నందున ఆలయ పరిసరాలను అధికారులు పరిశీలించి ఆలయ బాధ్యులకు పలు సూచనలుచేశారు. మంజీర పాయలో చెత్తాచెదారాన్ని గమనించిన అధికారులు ఆలయ అధికారులపై అక్షింతలు చల్లారు. పారిశుద్దానికి పెద్ద పీటల వేయాలని అధికారులను ఆదేశించారు. రాజగోపురం నుంచి ఆలయం వరకు రెడ్ కార్పెట్ ఏర్పాటు చేసి ఇరువైపులా పూల మొక్కలు ఏర్పాటు చేయాలని, ఆలయ ప్రాంగణం వివిధ రకాల పూలతో అందంగా అలంకరించి ఆధ్యాత్మికత ఉట్టి పడేలా అమ్మవారి మూలవిరాట్ విగ్రహాన్ని అలంకరించాలని, రాజగోపురం రోడ్డు వెడల్పు పనులు చేపట్టి రోడ్డును చదును చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్బంగా ఎలాంటి పొరపాట్లు ఎదురుకాకుండా చూడాలని ఇఓ చంద్రశేఖర్‌ను అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సూర్యశ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, రవికుమార్, శ్రీనివాస్‌శర్మ, పండితులు శంకర్‌శర్మ, పార్థివశర్మ, రాముశర్మ, రాజశేఖర్‌శర్మ, మురళిశర్మ ఉన్నారు.

## రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కర్**

**సంగారెడ్డి బ్యూరో డిసెంబరు 23, (ప్రభాతవార్త):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తుంది జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డిలు అన్నారు. సోమవారం మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ జన్మదిన దినోత్సవం జాతీయ రైతు దినోత్సవం ను పురస్కరించుకొని పోతిరెడ్డిపల్లి రైతు వేదికలో మంజీర రైతు సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ రైతు దినోత్సవానికి వారు ముఖ్య అతిథులు గా హాజరై మాట్లాడారు. గత 10 సంవత్సరాలలో గత ప్రభుత్వం రైతులకు రాయితీ విత్తనాలు రాయితీయంత్ర పరికరాలు ఇవ్వడం మానివేసి రైతులను మోసగించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపు 2 లక్షల లోపు రుణమాఫీ ఇవ్వడంతో పాటు రాయితీపై ఆధునిక వ్యవసాయంత్ర పరికరాలు, ఇరిగేషన్ పరికరాలు ఇస్తున్నదన్నారు. ఈ సందర్భంగా సుమారు 20 మంది ఆదర్శ రైతులకు ఎంపీ, టిజీఐఐసి చైర్మన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జెడి ఎంఎల్ఎస్ బండరీ వసంతకుమారి, మంజీరా సమాఖ్య రైతులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపి సురేష్ షెట్కర్

# క్రైస్తవ పుణ్యక్షేత్రంగా మెదక్ చర్చి

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు**



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్ రావు

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబరు 23 ప్రభాతవార్త:** మెదక్ చర్చి వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో పాల్గొనటం సంతోషంగా ఉందని, పేరు పేరునా ప్రతి ఒక్కరికీ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం మెదక్ చర్చి వందేళ్ల వేడుకల్లో హరీష్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్లుగా ఆసియాలోనే రెండో అతిపెద్ద క్రైస్తవ పుణ్యక్షేత్రంగా మెదక్ చర్చి వర్ధిల్లుతోందని, కల్లోల జగతికి శాంతి సందేశం అందించిన కరుణామయుడి గొప్ప ప్రార్థనా మందిరంగా ప్రఖ్యాతి గాంచిందని, ఈ చర్చి నిర్మాణాన్ని ఇంగ్లాండ్‌కు చెందిన రెవరెండ్ చార్ల్స్ వాకర్ ఫాస్నెట్ 1914లో ప్రారంభించారని, 1924 డిసెంబర్ 25న పూర్తయిందన్నారు. ఈ కార్యక్రమంలో వారి మనువడు పాల్గొనడం ఆనందంగా ఉందని, మెదక్ ప్రాంతంలో 1914లో తీవ్ర కరువు ఉండేదని, ప్రజలు ఆకలితో అలమటించేవారని, చార్లెస్ వాకర్ ఫాస్నెట్ కరువుతో అల్లాడుతన్న ప్రజలను చూసి చలించి ఉచితంగా కాకుండా ప్రజలకు పనిచూపి వారి ఆకలి తీర్చాలని సంకల్పించాడని అన్నారు. అలా వారి చేత ఏసుక్రీస్తు మందిరం నిర్మిస్తూ వారి ఆకలిని తీర్చాడని, చారిత్రాత్మకమైన ఈ చర్చి మన మెదక్ జిల్లాలో ఉండటం మనకేకాదు, యావత్ తెలంగాణ రాష్ట్రానికి ఎంతో గర్వకారణం అన్నారు. కేసీఆర్ గారి ప్రభుత్వం పోయి, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయిందని, గత తొమ్మిదన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ క్రిస్టియన్ సోదరులు, సోదరీమణులకు కేసీఆర్ ఏం చేసారు, ఎంత బాగా చూసుకున్నారో మీ అందరికి తెలుసన్నారు. క్రిస్మస్ పండుగను రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటించి ఘనంగా నిర్వహించారన్నారు. క్రిస్మస్‌ను అధికారికంగా జరిపిన ఒకే ఒక్క ముఖ్యమంత్రి కేసీఆర్ అని, క్రిస్టమస్ డే మరుసటి రోజు జరుపుకునే బాక్సింగ్ డేను సెలవుగా ప్రకటించారు. అంటే డిసెంబర్ 25తోపాటు, 26న ఘనంగా పండుగ జరుపుకునేలా రెండు రోజులు సెలువు ఇచ్చారన్నారు. ప్రతి క్రిస్టమస్ పండుగ నాడు పేద క్రిస్టియన్లకు గిఫ్టులు ఇచ్చారని, కేసీఆర్ ఒక్క మతమని కాదు.. హిందూ, ముస్లిం, క్రిస్మస్, సిక్కు ఇలా అన్ని మతాలను సమానంగా గౌరవించి వారు సంతోషంగా జీవించేలా చూశారన్నారు. అన్ని వర్గాలు బాగున్నందునే హైదరాబాద్, తెలంగాణ భిన్నత్వంలో ఏకత్వం అనడానికి నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు. ఇది ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నానని, శాంతి, కరుణ, క్షమాగుణం నేర్పే క్రీస్తు బోధనలు సర్వమానవాళి ఆచరణీయం అని, ప్రజలందరికీ సుఖ శాంతుల కలగాలని ఆ ఏసును ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## బ్రాహ్మణపల్లిలో నేటి నుండి జాతర



జాతర ఉత్సవాలకు సిద్ధమైన చిత్తారమ్మదేవి ఆలయం దృశ్యం

**నర్సాపూర్, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండలపరిధిలోని బ్రాహ్మణపల్లిగ్రామంలో వెలసిన చిత్తారమ్మ దేవి జాతర ఉత్సవాలు నేటి నుండి ప్రారంభం అవుతాయని గ్రామస్థులు వెల్లడించారు. ఈసందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ 24వ తేదీన గంగపటము, 25వ తేదీన అగ్నిగుండాలు, బండ్లు తిరుగుట, బోనాల ఊరేగింపు, 26వ తేదీన పాచిబండ్ల ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయడం జరిగిందని ఉత్సవ కమిటీ సభ్యులు వెల్లడించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మకృపకు పాత్రులు కాగలరని కోరారు.

## బివిఆర్ఐటి కళాశాలలో అంతర్జాతీయ సదస్సు



అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు తదితరులు

**నర్సాపూర్, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్, హెల్త్‌కేర్ సిస్టంపై ఈనెల 23,24 తేదీలలో నిర్వహించే అంతర్జాతీయ సదస్సును ప్రారంభించడం జరిగిందని బివిఆర్ఐటి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ దూబే తెలిపారు. ఈ కార్యక్రమానికి జపాన్ దేశానికిచెందిన కుమాంటో యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ తాకాసి వాటానాభి, సాగా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ యూకిమో నగారోలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫార్మాటెక్నాలజీ, ఇంజనీరింగ్ టెక్నాలజీ వల్ల మానవాళి వృద్ధిచెందుతుందని వెల్లడించారు. మానవాళి అవసరాలన్నీ ఫార్మారంగంతో ముడిపడి ఉన్నాయని పేర్కొంటూ, ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఫార్మారంగంలో విశిష్ట పరిశోధనలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలకు పూర్తి సహకారాన్ని, ప్రోత్సాహాన్ని అందిస్తామని వారు వెల్లడించారు. ఈకార్యక్రమంలో విశిష్ట అతిథి డాక్టర్ రచన త్రిపాఠి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ దూబే, మేనేజర్ బాపిరాజు, ఏవోలు అశోక్ రెడ్డి, సురేష్, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఖోఖోలో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

**నర్సాపూర్, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండలపరిధిలోని జక్కపల్లి తెలంగాణ మోడల్‌స్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఫర్హానా తెలిపారు. ఆదివారం నర్సాపూర్‌లోని గిరిజన బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో ఉమ్మడి జిల్లాస్థాయి మహిళల, పురుషుల సీనియర్ ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ ఖోఖో పోటీలో జక్కపల్లి మోడల్‌స్కూల్‌కు చెందిన 7మంది విద్యార్థినులు ప్రసన్న, దివ్య, భవ్య, తేజస్విని, ధరణి, రమ్య, సుప్రియలు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈమేరకు వచ్చే సంవత్సరం జనవరి 8,9, 10వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖోపోటీలో పాల్గొంటారని ఆమె తెలిపారు. ఈసందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులను మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఫర్హానాతో పాటు పిడి అశోక్, ఉపాధ్యాయ బృందం తదితరులు అభినందించారు.

## సిఎస్ఐ చర్చిలో ఏసుప్రభువు స్కిట్



సిఎస్ఐ చర్చిలో ఏసుప్రభువు పుట్టిన స్కిట్‌ను ప్రదర్శిస్తున్న చిన్నారులు

**నర్సాపూర్, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలోని సిఎస్ఐ చర్చిలో క్రిస్టమస్ పర్వదినాన్ని పురస్కరించుకొని క్రిస్టమస్ సండే స్కూల్ విద్యార్థులు ఏసుప్రభువు పుట్టిన స్కిట్‌ను ప్రదర్శించారని పాస్టర్స్ తెలిపారు. ఈప్రదర్శనలో చిన్నారులు ఏసుప్రభువుపై పాడిన పాటలు, చేసిన నృత్యాలు చూపరులను ఎంత గానో ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో రేవరెంట్ దారా సందీప్, పాస్టర్ రెవరెండ్ బాలసుబ్రమణ్యం, పాస్టర్స్ లక్ష్మణ్, సాగర్, ఫాస్ట్‌రేట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.
ఈ నెల 24న మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని సాయికృష్ణ గార్డెన్ లో క్రిస్టమస్ పర్వదినాన్ని పురస్కరించుకొని గవర్నమెంట్ క్రిస్టమస్ ఫిష్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పాస్టర్స్ లక్ష్మణ్, సాగర్‌లు తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే ఈకార్యక్రమానికి రాజకీయ నాయకులు పాస్టర్స్, సంఘసభ్యులు హాజరవుతున్నట్లు తెలి పారు. ఈమేరకు ఈకార్యక్రమానికి అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం

**షాబాద్, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
కార్పొరేట్ ఆసుపత్రులు పేదప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ముందుకు రావాలని వెల్స్పన్ ఫౌండేషన్ సిఎస్ఆర్ హెడ్ సురేఖ అన్నారు. సోమవారం నాగర్‌కుంటలో వెల్స్పన్ ఫౌండేషన్, షాద్‌నగర్ ఎబివి ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేశారు. పేదలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులుపంపిణీ చేశారు. గ్రామానికిచెందిన 120మందికి పైగా ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహిం చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, గామీణప్రాంత ప్రజలు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులు పేదప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ముందుకు రావాలన్నారు. ఇలాంటి అవకాశాలు గ్రామీణప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాల న్నారు. ఈకార్యక్రమంలో వెల్స్పన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, బిసిఐ మేనేజర్ పవన్‌కుమార్, శిరీష, రమేష్, వైద్య సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ గణిత దినోత్సవం

**షాబాద్, డిసెంబరు 23, ప్రభాతవార్త:** శ్రీనివాస రామానుజన్ దేశానికే ఆదర్శప్రాయుడని షాబాద్ ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. షాబాద్ మండలంలోని సర్దార్‌నగర్ ఉన్నత పాఠశాలలో, మాంటిసోరి ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

# జిల్లాను పర్యాటకకేంద్రంగా తీర్చిదిద్దుతాం

### -మెదక్ జిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి
### -ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
### -మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, తదితరులు

**నర్సాపూర్, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
మెదక్‌జిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విశేషంగా కృషిచేస్తున్నారని అదేవిధంగా జిల్లాను పర్యాటకకేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్ నియోజక వర్గ క్యాంప్ కార్యాలయంలో ఈనెల 25న మెదక్ జిల్లాలో ముఖ్యమంత్రి శ్రీరేవంత్‌రెడ్డి పర్యటన నేప థ్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్‌నేత, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి రాజిరెడ్డి పాల్గొ న్నారు. ఈసందర్భంగా మాజీఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి హోదా లో మొదటిసారి మెదక్ జిల్లా పర్యటనకు వస్తున్న రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్, యూత్‌కాంగ్రెస్ నాయకులు అపూర్వస్వాగతం పలికి కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపుని చ్చారు. అంతేగాక మెదక్ జిల్లా అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నా రని పేర్కొన్నారు. ఆసియాఖండంలోనే అతిపెద్ద చర్చి అయిన మెదక్‌చర్చి వందేళ్లవేడుకలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. వందేళ్లచరిత్ర గలిగిన ఈ చర్చి మహాదేవాలయ సన్నిధికి రూ.29.18కోట్లు మంజూరుచేసినట్లు తెలిపారు. అంతేగాక జిల్లాలోనే అతిప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవానీమాతా ఆలయాన్ని సందర్శిస్తారని అన్నారు. ఈఏడుపా యల ఆలయాభివృద్ధికి రూ.35కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈఏడుపాయల ఆలయాన్ని పర్యాటకక్షేత్రంగా మార్చేందుకు అన్నిచర్యలు తీసు కుంటారని తెలిపారు. రాజకీయ నాయకులు పార్టీ లకతీతంగా రాజకీయాలు మాని మెదక్‌జిల్లా అభి వృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనను విజయ వంతం చేయడానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు కృషిచేయాలని కోరారు. ఈకార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి, టిపిసిసి రాష్ట్ర నాయకులు సుప్రభాతరావు, మైపాల్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేశం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హరీష్‌వర్ధన్, కాంగ్రెస్ బిసిసెల్ మండల అధ్యక్షుడు రెడ్డిపల్లి అశోక్‌గౌడ్, ఎన్ఎస్‌యుఐ నాయకుడు మణిదీప్, ఇండియా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రియాజ్ అలీ, అల్తాఫ్, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## నియంత్రికకు మరమ్మత్తులు చేయించాలి

**చిన్నశంకరంపేట, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
వ్యవసాయ పొలాల వద్ద ఉన్న విద్యుత్ నియంత్రికకు అధికారులు వెంటనే మరమ్మత్తులు చేయించాలని మండలపరిధి చందంపేట రైతులు కోరారు. గత రెండునెలల్లోనే నాలుగు సార్లు ఈవిద్యుత్ నియంత్రిక చెడిపోవడంతో రైతులు మరమ్మతులు చేయించుకున్నారు. వరినాట్లు దగ్గరికొస్తున్నాయని, ఇలా నియం త్రిక పదేపదే చెడిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

## పిరయ్యను పరామర్శించిన మందకృష్ణ మాదిగ



నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఇసంపల్లి పిరయ్యను పరామర్శిస్తున్న మందకృష్ణ మాదిగ

**మనూర్, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని బోరంచ గ్రామానికి చెందిన వికలాంగుడు ఐలంపల్లి పీరయ్య గుండె, ఊపిరితిత్తుల వ్యాధితో అవస్థలు పడుతూ పంజాగుట్టలోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స అందుకుంటున్నట్లు ఎంపిటిసి మాజీ సభ్యులు రవీందర్ ద్వారా తెలుసుకున్న మందకృష్ణ మాదిగ సోమవారం ఆసుపత్రికి చేరుకుని పిరయ్యను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి లోని డాక్టర్లకు సూచించారు.

## ఆయిల్‌ఫామ్ సాగుతో అధిక లాభాలు





రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

**వర్గల్, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
ఆయిల్‌ఫాం సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని తునికిఖాల్సా గ్రామ రైతు వేదికలో రైతులకు ఆయిల్‌ఫామ్ పంట సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో 12వేల ఎకరాలలో ఆయిల్‌ఫామ్ పంట సాగు అవుతుండగా వర్గల్ మండలంలో 265 ఎకరాలలో రైతులు సాగు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని నేలలు ఆయిల్‌ఫామ్ సాగుకు అనుకూలమని, ప్రభుత్వం ఆయిల్‌ఫామ్ సాగును ప్రోత్సహిస్తూ మొక్కకు, డ్రిప్‌కు 90 శాతం సబ్సిడీ ఇవ్వడంతో పాటు సంవత్సరానికి రూ.4200 తోట పెంపకానికి ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం టన్నుకు రూ.20,400 ఉందని, భవిష్యత్తులో పెరిగే అవకాశం ఉందని తెలిపారు. కాగా ఆయిల్‌ఫామ్ సాగులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను ఆయిల్‌ఫెడ్ అధికారి శంకర్, అనిల్‌లు వివరించారు. మొదటి మూడు సంవత్సరాలు కూరగాయలతో పాటు అంతర పంటలను సాగు చేసుకొని లాభాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శేషశయన, ఏఈఓలు సంతోష్, ధర్మేంద్ర, భారతి, సుప్రజ, రైతులు జహంగీర్, జాని, స్వామి, వేలూరి కిష్టారెడ్డి, లక్ష్మణ్, విద్యాకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

## ఘనంగా అనఘాదత్త వ్రతమహోత్సవం



వ్రతమహోత్సవంలో పాల్గొన్న మహిళలు

**సంగారెడ్డి మున్సిపాలిటీ , డిసెంబరు 23, ప్రభాతవార్త:**
సంగారెడ్డి మండలం ఫసల్వాదిలోని శ్రీజ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో అనఘా దత్త మహోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. 215 గ్రామాల నుంచి వచ్చిన 2,400మంది మహిళలు వ్రతమహోత్సవంలో పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీమహేశ్వరశర్మ సిద్ధాంతి పూజాకార్యక్రమాలను నిర్వహించారు. అనఘాదత్త వ్రతమహోత్సవ కార్యక్రమం విశిష్టత గురించి భక్తులకు వివరించారు. భక్తులు శివపంచాక్షరి నామాన్ని జపించారు. కార్యక్రమంలో విద్యాపీఠం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాత్రికి కొనసాగిస్తున్న భూమి రిజిస్ట్రేషన్‌లు



సర్వర్ డౌన్‌తో రాత్రి వరకు కొనసాగుతున్న రిజిస్ట్రేషన్లు

**ఝరాసంగం, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
రిజిస్ట్రేషన్‌ల కొరకు రెవిన్యూ కార్యాలయానికి వచ్చిన రైతులు రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెవిన్యూ కార్యాలయం నుంచి ఉదయం నుంచి రాత్రి వరకు వేచి చూడాల్సిన పరిస్థితి సోమారం దాపురించింది. సర్వర్ రాత్రికి అందుబాటు లోకి నిదానంగా వస్తుండటంతో అధికారులు రాత్రి అయినా ఉదయం నుంచి వేచి ఉన్న రైతులు, వ్యాపారుల కొరకు రాత్రి 7గంటలు దాటిన తరువాత సైతం భూముల రిజిస్ట్రేషన్ పనులు చేపట్టారు.

## విద్యార్థికి చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం

**వెల్దుర్తి, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
మంగళపర్తి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థి యశ్వంతరావుపేట గ్రామానికి చెందిన వంశీకి గత గురువారం కారు ఆక్సిడెంట్ వల్ల ప్రమాదం జరిగింది. అతడి చికిత్స కోసం మండలంలోని ఉపాధ్యాయులు, వేరే మండ లాల ఉపాధ్యాయులు రూ.63,000, మంగళపర్తి జిల్లాపరిషత్ ఉన్నత పాఠ శాల ఉపాధ్యాయుల బృందం రూ.40,000 మొత్తం రూ.1,03,000 వంశీ తండ్రి శ్రీనివాస్‌కు సోమవారం అందజేయడం జరిగింది. ఇంకా ఎవరైనా ఉపాధ్యాయులు విరాళం ఇస్తే వాటిని తరువాత అతని తండ్రికి ఇవ్వడం జరుగుతుందని, సహాయం చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు ఉపాధ్యాయుడు ఎన్.రామాగౌడ్, ఎంఐఎస్ నవీన్‌లు తెలిపారు.

## సాంకేతిక పద్ధతులతో వ్యవసాయం

**షాబాద్, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
సాంకేతిక పద్ధతులతో వ్యవసాయం చేయాలని సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ అన్నారు. రైతుదినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండలపరిధిలోని రేగడిదోస్వాడలో రైతులకు నూనెగింజల సాగు, కూరగాయలసాగు, వరిసాగు, పాడిపరిశ్రమలపై అవగాహన కల్పిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు దేశానికి వెన్నెముక లని, రైతు బాగుంటే దేశం బాగుంటుందన్నారు. సాంకేతిక పద్ధతులతో వ్యవసాయం చేయాలని సూచించారు.

# ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు

### తహసీల్దార్‌కు వినతిపత్రం అందించిన గ్రామస్థులు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

**పటాన్‌చెరు, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
జిన్నారం మండలం శివానగర్ గ్రామపరిధిలోని ఎల్ఈడి పార్క్ పక్కన ప్రభుత్వ భూముల్లో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామస్థులు తాహసీల్దార్ బిక్షపతికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత 20ఏళ్ల కిందట అప్పటి ప్రభుత్వం 13ఎకరాలు తొల్ల కార్ఖానాకు ఒక్కొక్కరికి 290గజాల చొప్పున కేటా యించిందని ఆభూముల్లో రెండు,మూడు కార్ఖా నాలు మాత్రమే ఉండేవని, మిగతాస్థలం అంతా ఖాళీగా ఉండేదాని ఇప్పుడు ఆభూమిని చదునుగా చేసుకొని ఎల్ఈడి పార్క్ పక్కన ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారు. గతంలో కూడా తహసీల్దార్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. అయినా మళ్లీ నిర్మాణాలు చేస్తున్నారని దీనిపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని, గవర్నమెంట్ అధీనంలో ఉన్న 20 ఎకరాల స్థలాన్ని శివానగర్ గ్రామస్థులకు ఇళ్ల స్థలాలని కేటాయించాలని తహసీల్దారు బిక్షపతి కోరారు. మళ్లీ ఇదే పునరావృతమైతే పెద్ద ఎత్తున కలెక్టర్ ఆఫీస్‌ను ముట్టడి చేస్తామని గ్రామస్థులు హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న శివా నగర్ గ్రామస్థులు మహిళలు, జిల్లా బిజెపి ఉపా ధ్యక్షులు వంగేటి ప్రతాపరెడ్డి కమ్మరి కృష్ణ శివా నగర్ బిజెపిబూత్ అధ్యక్షులు వినోద్, మండల బిజెపి అధ్యక్షులు కొత్తకాపు జగన్‌రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి మద్దూరి రాజు కె.వెంకటేష్ రామ చందర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆత్మస్థైర్యంతో ఎదగాలి

### వాయిస్ ఫర్ గర్ల్స్ అవగాహన ముగింపు

**మొయినాబాద్, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
మహిళలు ఆత్మస్థైర్యంలో ఎదగాలని, అన్ని రంగాల్లో ముందుండాలి, భవిష్యత్‌లో ఎదురయ్యే ప్రతిసమస్యకు పరిష్కారం దొరుకుతుందని, మహిళలుగా పుట్టినందుకు గర్వించాలని, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల శంకర్‌పల్లి మహిళ పాఠశాలలో వాయిస్ ఫర్ గర్ల్స్ పదిరోజుల శిక్షణశిబిరం నిర్వహించారు, సోమవారం శిక్షణశిబిరం ముగుస్తుండడంతో చివరిరోజు విద్యార్థులు పదిరోజుల్లో వారు నేర్చుకున్న వాటిని నృత్య, నాటక ప్రదర్శనల ద్వారా ప్రతిభను ప్రదర్శించారు, ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ వాయిస్ ఫర్ గర్ల్స్ అవగాహనశిబిరాన్ని, 8వ తరగతి చదువుతున్న విద్యార్థులను తీసుకొని శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు, ఈనెల 14వ తేదీన ప్రారంభించి విద్యార్థు లకు శిక్షణశిబిరంలో విద్యార్థులకు జీవనప్రమాణాలు, మానసిక అభి వృద్ధి, వ్యక్తిగత పరిశుభ్రతకు, వారి జీవననైపుణ్యాల పెంపునకు, సంబంధించి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈశిక్షణ ముగింపు కార్య క్రమానికి కోఆర్డినేటర్ పాఠశాల ఉపాధ్యాయులు, ముఖ్య అతిథిగా బి. కృష్ణారెడ్డి, డైరెక్టర్ ఆఫ్ క్లాస్ వన్ స్టడీసర్కిల్, పాల్గొన్నారు, 10రోజుల శిక్షణ ధృవీకరణ పత్రాలను బ్యాడ్జిలను ప్రిన్సిపాల్ చేతులమీదుగా విద్యా ర్థులకు అందజేశారు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**కడ్తాల్, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మీ షాదీముబారక్ పథకం గొప్ప వరమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పేదింటి ఆడపిల్లలు కలిగిన తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను రూపుమాపేందుకు కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకాలతో ఎంతో లబ్ది చేకూరుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కడ్తాల్ మండలకేంద్రంలో సోమవారం తహసీల్దార్ కార్యా లయంలో తహసీల్దార్ ముంతాజ్‌బేగం అధ్యక్షతన ఏర్పాటుచేసిన చెక్కులపంపిణీ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ముఖ్యఅతిథులుగా విచ్చేసి మండలపరిధిలోని అన్నిగ్రామాలకు చెందిన 31మంది లబ్దిదారులకు, పేదింటి ఆడపడుచులకు ప్రజాప్రతి నిధులు అధికారులు నాయకులతో కలిసి కళ్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆమనగల్ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ యాట గీత, నరసింహ ముదిరాజ్, వైస్‌ఛైర్మన్ గుడురు భాస్కర్‌రెడ్డి, టిపిసిసి సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, తహసీల్దార్ ముంతాజ్ బేగం, ఎంపిడిఓ సుజాత, ఏఎంసి డైరెక్టర్ నరేష్ నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ చేగురి వెంకటేష్, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌డ్డి, డిసిసి కార్యదర్శి బిక్యనాయక్, బ్లాక్‌కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాట నరసింహ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిచ్చనాయక్, ప్రభాకర్ రెడ్డి, అద్దాల రాములుగౌడ్, పోతుగంటి అశోక్, రాజేష్, రామచంద్రి నాయక్, జంగిర్ అలీ, యాదగిరి రెడ్డి, శేఖర్ గౌడ్, సుమన్, మలెమల్లేష్ గౌడ్, రామకృష్ణ, శబ్బు, రామ చంద్రినాయక్, హీరాసింగ్, రాజేందర్ గౌడ్, ఇమ్రాన్ బాబా, పట్టణ, మండల పార్టీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలికి ప్రముఖుల ఘన నివాళి

**తలకొండపల్లి డిసెంబరు 23, ప్రభాతవార్త:**
తలకొండపల్లి మండల మెట్రో ఈవినింగ్ దినపత్రిక రిపోర్టర్ తక్కల్లపల్లి రాజేందర్ తల్లి తక్కెళ్ళపల్లి మరియమ్మ(58) ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆదివారం ఉదయంనుంచి ఇంటిలో ఉన్న మరియమ్మ ఇంట్లో ని పనులన్నీ చక్కదిద్ది రాత్రి భోజనంచేసిన అనంతరం తనకు కండ్లు తిరుగుతున్నాయని కుమారుడు రాజేందర్‌తో తెలిపారు. దీంతో హుటా హుటిన కల్వకుర్తిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. మృతురాలి కుటుంబ సభ్యులను సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పరామర్శించి మరియమ్మ పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తలకొండపల్లి మండల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు పాల్గొని రాజేందర్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దరువుల శంకర్, గౌరవ అధ్యక్షులు విష్ణువర్ధన్ యాదవ్, ఉపాధ్యక్షులు చప్పిడి తిరుపతి, జర్నలిస్టు నాయకులు చంద్రకుమార్ వెంకట్‌రెడ్డి, మహేష్, గణేష్, యుటిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కొమ్ము జంగయ్య, తలకొండపల్లి మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాములు, మాజీ జెడ్పిటిసి పద్మ నరసింహ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దోకురి ప్రభాకర్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచులు జోలం జయ మ్మ వెంకటయ్య, మైసయ్య, లింగం గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రేన్ రెడ్డి, కాకి కృష్ణ, డేవిడ్, టిఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, సిపిఎం నాయకులు కొమ్ము చెన్నయ్య, దుబ్బ చెన్నయ్య, తదితరులు ఉన్నారు.

## సంస్కృతి టౌన్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాలుగోసారి హరిప్రసాద్‌రావు ఎన్నిక

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 23, ప్రభాత వార్త:**
పోచారం సంస్కృతి టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఒక్కఓటు తేడాతో బెజ్జంకి హరిప్రసాద్‌రావు ఎన్నికయ్యారు. ఆదివారం అసోసియేషన్ ఎన్నికలు ఓటింగ్ పద్ధతి ద్వారా జరిగాయి. సాయంత్రం ఎన్నికల కౌంటింగ్ ప్రారంభం కాగా రాత్రి పొద్దుపోయే వరకు కౌంటింగ్ కొనసాగింది. అధ్యక్షపదవితో పాటు ఉపాధ్యక్షపదవికి అభ్యర్థుల భవితవ్యం నువ్వా, నేనా అన్నట్లు సాగింది. చివరికి ఒకే ఒక ఓటుతేడాతో అధ్యక్షుడిగా బి.హరిప్రసాద్‌రావు నాలుగోసారి గెలుపొం దారు. ఉత్కంఠభరితంగా సాగిన ఎన్నికల కౌంటింగ్‌కు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు, సిఐ రాజువర్మ ఆధ్వర్యంలో గట్టిబందోబస్తు ఏర్పా టుచేశారు. కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఇందిరాప్రియదర్శిని, కోశాధికారిగా శశిధర్ లాల్, సభ్యులుగా రోహిత్‌రావు, అనిల్‌రెడ్డి, భానుప్రసాద్, దీపక్ నాయక్, బిందుపాత్రో, పివిసరిత, జివిఎస్‌ప్రతిభ, ప్రగతి ఎన్నికైనట్లు తెలిపారు.

## సృజనాత్మకతను వెలికితీయడానికే సైన్స్‌ఫెయిర్

### చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

**షాబాద్, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి సైన్స్‌ఫెయిర్ ఎంతగానో ఉపయోగపడుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. షాబాద్ మండలపరిధిలోని నాగర్‌గూడలో అక్షర టాలెంట్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో ఆయన పాల్గొన్నారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ....విజ్ఞాన ప్రదర్శనలతోనే విద్యార్థుల మేదస్సు పెంపొందుతుందన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి సైన్స్‌ఫెయిర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దేశంలోనే అన్నిరంగాల్లో దూసుకుపోవడానికి కారణం మానవుడు సాధిం చిన విజ్ఞానమేనన్నారు. మానవుడి బుద్ధివికాసానికి విజ్ఞానశాస్త్రమన్నారు. విద్యార్థిదశ నుండే విద్యార్థులు విజ్ఞానంపై పట్టు సాధించాలన్నారు. ఈకార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కావలి చంద్రశేఖర్, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, పాఠశాల కరస్పాండెంట్ రాజుగౌడ్, మాజీ ఎంపిటిసి మద్దూరి పాండు, కుమ్మరి చెన్నయ్య, ఆశోక్, నాయకులు చేవెళ్ల స్వామి, రాఘవేందర్, కృష్ణగౌడ్, మహేందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, భార్గవ్‌రామ్, వేణు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

**జిల్లెడు చౌదరిగూడ, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయాగ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతుంది. మండలంలోని జిల్లెడు,పీర్జాపూర్, గుంజల్‌పహాడ్ తదితర గ్రామాల్లో ఎంపిడిఓ ప్రవీణ్ కుమార్ సోమవారం పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్మాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వద్దని అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసిలసంఘం మాజీ మండలాధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ఏపిఎం నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# అల్లు సమస్య ముఖ్యమా.. ప్రజాసమస్యలు ముఖ్యం కావా...

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు


మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్ రావు

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబరు 23 ప్రభాతవార్త:** 15 రోజులుగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు సోమవారం దీక్ష శిబిరానికి వెళ్లి వారికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డికి అల్లు అర్జున్ సమస్య ముఖ్యమైంది కానీ, ప్రజల సమస్యలు ముఖ్యం కావా అని ప్రశ్నించారు. 20 వేల మంది సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు రోడ్డు మీద పడితే ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక చాయ్ తాగినంత సమయంలో సమస్యలు పరిష్కరిస్తా అని మాట తప్పారని, డిసెంబర్ 9వ తేదీ నుండి సమ్మె చేస్తుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీలో నిలదీసినా స్పందన లేదని, అన్ని వర్గాల ప్రజలను రేవంత్‌రెడ్డి, మంత్రులు మోసం చేశారన్నారు. ఎంత మంది మాట్లాడినా చలనం లేకుండా ఉన్నారని, విద్యాశాఖకు మంత్రి లేడని, బడ్జెట్‌లో 15 శాతం నిధులు అని, 7 శాతం కూడా పెట్టలేదన్నారు. 1వ తేదీన జీతాలు అని నరుకుతున్నడు తప్ప, చేతల్లో ఏం లేదని, నిరసన చేయడం వల్ల లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. గ్రీన్ ఛానెల్ నిధులు అనేది వట్టి మాటలే అని, సస్పెండ్ చేయాల్సింది వార్డెన్లు, ప్రిన్సిపాల్‌లను కాదు, రేవంత్‌రెడ్డిని చేయాలన్నారు. ఉన్న పథకాలు ఇవ్వరు, కొత్త పథకాలు లేవని, పింఛన్లు పెంచుతామని మోసం చేశారని, వృద్ధాప్య పింఛన్లు రెండు నెలలు ఎగ్గొట్టిండని అన్నారు.

బడా కాంట్రాక్టర్లకు పర్సంటేజ్ తీసుకొని బిల్లులు ఇస్తున్నాడని, మాజీ సర్పంచులకు బిల్లులు ఇవ్వడం లేదని, ప్రశ్నిస్తే ఎక్కడికక్కడ అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు మీకు బిఆర్ఎస్ అండగా ఉంటుందని, సమస్య పరిష్కారం అయ్యేదాకా కొట్లడతామన్నారు. మీ సమస్యల పట్ల ప్రభుత్వానికి త్వరలో డెలిగేషన్ ఇస్తామని, 25వ తేదీన వస్తున్న రేవంత్‌కు చీము నెత్తురు ఉంటే ఈ రోడ్డు ముందు నుండే పోతాడని, వీరి వద్దకు, ఈ టెంట్‌వద్దకు రావాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మెదక్ చర్చి మీద ఒట్టు పెట్టి రుణమాఫీ మాట తప్పాడని, మీ సమస్య పరిష్కారం కోసం మా వంతు సహకారం ఉంటుందన్నారు. అసెంబ్లీలో మాట్లాడతానని చెప్పాను. ముల్లును ముల్లుతోనే తీయాలి అన్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించండి.. రేవంత్‌ను నిలదీయండని అన్నారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న సురేష్

## సమగ్ర శిక్ష ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

### తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్

**సిద్దిపేట అర్బన్, డిసెంబరు 23, ప్రభాతవార్త :** సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరణ చేయాలని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాజ్ సురేష్ డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమగ్రశిక్ష ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారంతో 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తపస్ సంఘీభావం ప్రకటించింది. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో ఇచ్చిన హామీలను మరిచిపోయి సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులను అధికారంలోకి రాగానే మోసం చేస్తున్నారని మండిపడ్డారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు 14 రోజుల నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమగ్రశిక్ష ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళీధర్, రాష్ట్ర కార్యదర్శులు పబ్బతి శ్రీనాకర్ రెడ్డి, సింగోజు జనార్థన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నర్సిరెడ్డి, జిల్లా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు గణిత టాలెంట్ టెస్టు


విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, డిసెంబరు 23, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో సోమవారం మండలస్థాయిలో ప్రాథమిక పాఠశాల గణిత టాలెంట్ టెస్టును నిర్వహించారు. మండలంలోని 13 ప్రాథమిక పాఠశాలల 5వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. టాలెంట్ టెస్టులో కొమురవెల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థి బూరుగు సాహితి, రెండో బహుమతి ఎంపిపిఎస్ మర్రి ముచ్చాల విద్యార్థి సి,హెచ్. కావ్య తృతీయ బహుమతి ఎంపిపిఎస్ కొమురవెల్లి విద్యార్థి జె.నిహారికలు గెలుపొందారు మండల విద్యాశాఖ అధికారి రమేష్ చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్ అందించారు. కార్యక్రమంలో కొమురవెల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మంజుల, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఏసు ప్రభు దీవెనలతో మరో పదేళ్లు సిఎంగా రేవంత్‌రెడ్డి

### కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు


క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, డిసెంబరు 23, ప్రభాతవార్త:** ఏసుప్రభు దీవెనలతో మరో పదేళ్లు సిఎంగా రేవంత్‌రెడ్డి ఉంటారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. జిల్లా కేంద్రంలోని సిఎస్ఐ చర్చిలో నిర్వహించిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రైస్తవుల సంక్షేమానికి సిఎం రేవంత్‌రెడ్డి సర్కారు కృషి చేస్తుందన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, ఇంచార్జి మంత్రి కొండా సురేఖ, దామోదర రాజనరసింహ, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి హరికృష్ణ సూచనమేరకు ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం జరిగిందన్నారు. క్రైస్తవులు క్రిస్మస్ పండగను సుఖసంతోషాలతో జరుపుకోవాలన్నారు. అనంతరం ఎం.డి.ఇమామ్(అత్తు) సిఎస్ఐ చర్చ్ ఫాదర్ ఆంటోని తో పాటు పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తప్పెట శంకర్, గ్యాదరి మధు, గయాజుద్దీన్, సలీం, ఫయాజ్,నజ్జు పాల్గొన్నారు.

## దూళిమిట్ట పాఠశాలలో గణిత దినోత్సవం


రామానుజన్ ఫొటోకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**దూళిమిట్ట, డిసెంబరు 23, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం, గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గణిత పాఠానికి సంబంధించి తెలియజేసే వివిధ నమూనాలతో ఏర్పాటు చేసిన గణిత గ్రంథాలయాన్ని మద్దూరు ఎంఈవో వరదరాజులు, చేర్యాల ఎంఈవో కిష్టయ్యతోపాటు ప్రధానోపాధ్యాయులుతో కలిసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులకు గణిత నమూనాలతో కూడిన ముగ్గుల, క్వీజ్, గణిత ఉపన్యాస పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆకునూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఐలయ్య, జాలపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు హేమచందర్, రిటైర్డ్ ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డి, గణిత ఉపాధ్యాయులు చిలుక వెంకటయ్య, కాంపెల్లి సమత,నిమ్మ సురేందర్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు కక్కెర్ల నాగరాజు,మానుక శ్రీనివాస్,వంగ శ్రీనివాస్‌రెడ్డి,ఇర్రి రాజిరెడ్డి,నాగులపల్లి రాములు,సిరబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పంచతంత్ర పాఠశాలలో రైతు దినోత్సవం

**చేర్యాల, డిసెంబరు 23, ప్రభాతవార్త :** పట్టణంలోని పంచతంత్ర పాఠశాలలో రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం ప్రపంచ రైతు దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు రైతు వేషధారణలో ఆకట్టుకున్నారు. వ్యవసాయ క్షేత్రంలోకి విద్యార్థులతోపాటు పాఠశాల సిబ్బంది వెళ్లి రైతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. రైతు లేనిదే దేశం లేదు,రైతే రాజు అని విద్యార్థులకు ప్రిన్సిపల్ శ్యామల తెలిపారు.కార్యక్రమంలో రైతులతో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


రైతులు,రైతుల వేషధారణలో విద్యార్థులు


హనుమతండాలో సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

## తోర్నాలలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే

**దూళిమిట్ట, డిసెంబరు 23, ప్రభాతవార్త :** మండలంలోని తోర్నాల గ్రామ శివారు హనుమతండలో ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను జూనియర్ అసిస్టెంట్ రాజ్ కుమార్ తోర్నాల గ్రామపంచాయతి కారోబార్ కొంరెల్లితో కలిసి ఇంటింటా తిరిగి సోమవారం పత్రాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకుని నమోదు చేసుకున్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటాం

### -బిజెపి మండల అధ్యక్షుడు పాతురి దయాకర్‌గౌడ్


మాట్లాడుతున్న పాతురి దయాకర్‌గౌడ్

**కొల్చారం, డిసెంబరు 23 ప్రభాతవార్త:** మొదట అన్న లక్ష రూపాయల రైతు రుణమాఫీకే మోక్షం లేదని, ఇక రెండు లక్షల రుణమాఫీ ఏదైతే అన్నారో గానీ దాని సంగతి దేవుడు ఎరుగు అని బీజేపీ మండల అధ్యక్షుడు పాతురి దయాకర్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ లక్ష రూపాయల రుణమాఫీ కానీ రైతులు కొల్చారం మండలంలో వందల సంఖ్యలో ఉన్నారని అన్నారు. బీజేపీ సైనికులతో, రుణమాఫీ కానీ రైతులతో ముఖ్యమంత్రి పర్యటనకు సెగ తప్పదని దయాకర్ గౌడ్ అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకొని తీరుతామని హెచ్చరించారు.

## యువత క్రీడల్లో రాణించాలి : సంతోష్‌రావు


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న సంతోష్ రావు

**కొల్చారం, డిసెంబరు 23 ప్రభాతవార్త:** యువత క్రీడల్లో రాణించాలని బిఆర్ఎస్ యువత మండల అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్‌రావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఆండ్రాయిడ్ ఫోన్స్ వల్ల చెడిపోతున్నారని, ఆట పోటీలను నిర్వహిస్తే మంచి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదవ్ గౌడ్, సీడీసీ మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి, సిద్ధిరాములు, మాజీ సర్పంచ్ నెల్లి కిష్టయ్య, ముత్యంగారి సంతోష్ కుమార్, యూత్ ఐకాన్ రవితేజ, చిట్యాల యాదయ్య, గౌరీ శంకర్, రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## టిజిఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడిగా ఉప తహసీల్దార్ ప్రదీప్

**కొండాపూర్, డిసెంబరు 23 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కొండాపూర్ మండల ఉప తహసీల్దార్ మర్రి ప్రదీప్‌ను టీజీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చినందుకు ఏంతో సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు ఆఫీస్ సబార్డినేట్ నుంచి ఉప పాలనాధికారి వరకు ఒకే వేదికగా టీజీఆర్ఎస్ఏ చేయబడిందన్నారు. ప్రతి రెవెన్యూ ఉద్యోగి సంక్షేమం కోసమే పని చేస్తానన్నారు. ఇటీవల ప్రభుత్వం తీసుకున్న భూ భారతి చట్టం రైతుల సమస్యలకు సంజీవని వలె పని చేస్తుందన్నారు. అదేవిధంగా గ్రామ స్థాయిలో రెవిన్యూ అధికారులను తిరిగి నియమించడం వల్ల రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రెవిన్యూ ఉద్యోగులంతా ఐక్యంగా పని చేస్తే అటు రైతులకు, ఇటు ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


టీజీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన ప్రదీప్‌ను సన్మానిస్తున్న దృశ్యం



కేక్ కట్ చేస్తున్న శాసన సభ్యులు మైనంపల్లి రోహిత్ రావు

## ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి మార్గదర్శకం

### మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబరు 23 ప్రభాతవార్త :** మెదక్ జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలోని మాయ గార్డెన్‌లో నిర్వహించిన క్రిస్టమస్ సెలబ్రేషన్స్–2024 వేడుక లకు మెదక్ నియోజకవర్గ శాసనసభ్యుడు మైనంపల్లి రోహిత్‌రావు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి మార్గదర్శకం అన్నారు. గత పాలకులు 10 సంవత్సరాలుగా మెదక్ నియోజకవర్గ అభివృద్ధి పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంవత్సరం కాలంలోనే 30 కోట్లతో మెదక్ చర్చిని అభివృద్ధి చేసినట్లుగా వివరిం చారు. గత పాలకులు మెదక్ జిల్లా అభివృద్ధికి కన్నెత్తి కూడా చూడలేదని, అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందు ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మైనార్టీ సంక్షేమ అధికారి జమ్లా నాయక్, తాహశీల్దార్ లక్ష్మణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## నల్లవల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే


ఇందిరమ్మ ఇండ్ల కోసం సర్వే చేస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, డిసెంబరు 23 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నల్లవల్లి గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇండ్ల కోసం సర్వే చెప్పట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు రవీందర్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అధికారులకు సహకరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని, నల్లవల్లి గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్, శివ, ఆశయ్య, శ్రీశైలం, హరి బాబు, మన్నె రాజు, యాదాగౌడ్ పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రైతులకు సన్మానం

**గజ్వేల్, డిసెంబరు 23 (ప్రభాతవార్త):** జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం గజ్వేల్‌లో లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గోలి సంతోష్ ఆధ్వర్యంలో రైతులను సన్మానించి మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా గోలి సంతోష్ మాట్లాడుతూ రైతు లేనిదే రాజ్యం లేదని, ఎండ, వాన, చలికి తట్టుకొని కష్టపడి పంటను పండిస్తూ మనకు అందిస్తున్న రైతు లకు అందరం రుణపడి ఉండాలని, జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రైతులను సన్మానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షుడు మల్లేశంగౌడ్, నేతి శ్రీనివాస్, సంజయ్‌గుప్త, దొంతుల సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.


రైతును సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

## విద్యుదాఘాతంతో కూలీ మృతి

**రాయపోల్, డిసెంబరు 23 ప్రభాతవార్త :** విద్యుత్ షాక్ తగిలి కూలి మృతి చెందిన సంఘటన రాయపోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన ఈర్గ అంజిబాబు(19) కూలి పనులు చేస్తుండేవాడు. మూడు నెలల క్రితం కొండపోచమ్మ కాల్వ నిర్మాణ పనులకు రాయపోల్ మండలం వీరానగర్ వచ్చి ముంగజిపల్లి పరిధిలో కాలువ నిర్మాణ పనులు చేస్తున్నాడు. సోమ వారం కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా ముంగాజిపల్లి గ్రామ శివారులో కాలువ నిర్మాణ పనుల్లో సిమెంట్, కాంక్రీట్‌తో నిండిన వాహనం టీఎస్12 యూడి 3844లో నుండి కాంక్రీట్ దించుతుండగా ఆ వాహనానికి ఆరేపల్లి నుండి ముంగాజీపల్లికి వచ్చే 11కెవి ఎల్‌టి లైన్ తీగలు వాహనానికి తగిలి ఉన్నాయి. అది గమనించక ఈర్గ అంజిబాబు కాంక్రీట్ వాహనాన్ని తాకడంతో విద్యుత్ షాక్ తగిలి స్పృహ తప్పిపడిపోయాడు. వెంటనే అతడిని ప్రైవెట్ వాహనంలో గజ్వేల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఈర్గ కొండయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ కృష్ణంరాజు తెలిపారు.

## నేడు సిద్దిపేటలో కాంగ్రెస్ నిరసన కార్యక్రమం

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 23 (ప్రభాతవార్త):** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ నాయకులు తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు గజ్వేల్‌లోని తూంకుంట నర్సారెడ్డి నివాసం నుండి సిద్దిపేటకు భారీ సంఖ్యలో తరలివెళ్లడం జరుగుతుందని, నిరసన కార్యక్రమానికి బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతున్నట్లు తెలిపారు.

## మృతుడి కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

**హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 23, ప్రభాతవార్త :** నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలం గోవర్థనగిరి గ్రామానికిచెందిన పెండల ప్రశాంత్ కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా అతడికి హుస్నాబాద్‌లోని గాయత్రీ బ్యాంకులో నిర్భయ సేవింగ్ ఖాతాకు ప్రమాద బీమా కలిగి ఉండడంతో అతనికి మంజూరైన చెక్కును నామిని, మృతుని సహోదరుడు పెండల మధుకు బ్యాంకు మేనేజరు రామకృష్ణ హుస్నాబాద్ మండల ప్రజా పరిషత్ అధికారి వేణుగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా సోమవారం అందజేశారు. అనంతరం ఎంపిడివో మాట్లాడుతూ గాయత్రి బ్యాంకు ఖాతాదారులకు డిపాజిట్ డబ్బుతోనే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం బ్యాంకు మేనేజరు రామకృష్ణ మాట్లాడుతూ తమ బ్రాంచిలో సేవింగ్ అకౌంట్ తీసుకోవాల్సినవారికి కావాల్సిన ఫొటోలు, జిరాక్సు పత్రాలను ఉచితంగా ఇవ్వడంతోపాటు ప్రతీ ఖాతాదారునికి ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

## ఒత్తిడి తగ్గించేందుకే ప్రత్యేక తరగతులు : ప్రిన్సిపాల్

**హుస్నాబాద్ టౌన్, డిసెంబరు 23, ప్రభాతవార్త:** విద్యార్థులలో చదువు, పరీక్షలపట్ల భయంతోపాటు ఒత్తిడిని తగ్గించేందుకే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సిహెచ్ గంగాధర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ మీడియట్ కమిషనర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు హార్ట్ ఫుల్‌నెస్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక తరగతుల ప్రోగ్రాం ఇంచార్జి నరేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మానసిక స్థైర్యాన్ని పెంచుకోవాలని, పరీక్షల సమయంలో భయపడకూడదని, చదువుపై ఏకాగ్రత కలిగి ఉండాలంని చదువుకుంటేనే అన్ని రంగాలలో రానించవచ్చన్నారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధచూపడంతోపాటు వారిపై ఒత్తిడి పడకుండా ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతరులు పాల్గొన్నారు.

## బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

**చేర్యాల, డిసెంబరు 23, ప్రభాతవార్త :** చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసి ఆధ్వర్యంలో నేడు(మంగళవారం) నిర్వహించే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని జేఏసి నాయకులు కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ పట్టణంలోని హనుమాన్ దేవాలయం నుండి సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందిస్తామన్నారు. అందుకు నేటి ర్యాలీకి నాలుగు మండలాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జేఏసి అధికార ప్రతినిధి అందె అశోక్ తెలిపారు.

## మర్కుక్‌లో నాయీ బ్రాహ్మణుల నిరసన

### -మూడు రోజులుగా కులవృత్తి బంద్

**మర్కుక్, డిసెంబరు 23 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలో మూడు రోజులుగా నాయీబ్రాహ్మణులు వారి కులవృత్తిని బంద్ చేసి నిరసన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని నాయీబ్రాహ్మణ కులానికి చెందిన లింగంపల్లి ఎల్లమ్మ(48) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందగా వైకుంఠ ధామంలో అంత్యక్రియలు చేయకుండా గ్రామ పెద్దలు అడ్డుచెప్పడంతో నిరసన వ్యక్తం చేస్తూ వారి కులవృత్తిని బంద్ చేశారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు లింగంపల్లి బాలరాజు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా నాయీ బ్రాహ్మణ కులానికి సంబంధించిన స్థలంలోనే అంత్యక్రియలు చేస్తుండగా ఓ వ్యక్తి ఆ స్థలాన్ని కబ్జా చేసినట్లు తెలిపారు. శనివారం గ్రామంలో నాయీబ్రాహ్మణ కులానికి చెందిన వృద్ధురాలు చనిపోవడంతో కులానికి సంబంధించిన స్థలంలో అంత్యక్రియలు చేయడానికి అవకాశం లేకపోవడంతో గ్రామంలో రెండు వైకుంఠధామాలు ఉండగా వైకుంఠధామంలో అంత్యక్రియలు చేస్తామని గ్రామ పెద్దలను సంప్రదించగా నిరాకరించినట్లు తెలిపారు. చేసేదిలేక గ్రామంలోని పెద్దచెరువు వద్ద అంత్యక్రియలు చేయడం జరిగిందన్నారు. అంత్యక్రియలు చేయకుండా అడ్డుకున్న గ్రామ పెద్దలపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### బైండోవర్ అయినా వ్యక్తులు తిరిగి

## నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

### సిద్దిపేట ఎక్సైజ్ సిఐ శ్రీనివాస్

**సిద్దిపేట రూరల్, డిసెంబరు 23, ప్రభాతవార్త :** ఇక నుంచి ఎలాంటి నేరాలకు పాల్పడమని బైండోవర్ అయినా వ్యక్తులు తిరిగి మళ్లీ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిద్దిపేట ఎక్సైజ్ సిఐ ఆకుల శ్రీనివాస్ హెచ్చరించారు. డిపిఈఓ ఆదేశాల మేరకు గతంలో దుబ్బాక తహసీల్దార్ ఎదుట బైండోవర్ అయిన దుబ్బాకమండలం గంభీర్‌పూర్‌కు చెందిన చేపూరి నర్సింలు అలియాస్ నరేష్ తిరిగి ఇటీవల అప్పుజోలం రవాణా చేస్తూ పట్టుబడడంతో సోమవారం బైండోవర్‌కు సంబంధించిన బ్రీచ్ అమౌంట్‌ను కుటుంబీకులు సోమవారం రూ.లక్ష చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైండోవర్ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. నేరాలు చేసి బైండోవర్ అయినా వ్యక్తులు తిరిగి నేరాలు చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నారుమడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి : ఎవో

**మర్కుక్, డిసెంబరు 23 (ప్రభాతవార్త):** రైతులు నారుమడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మర్కుక్ మండల వ్యవసాయాధికారి వసంతరావు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో నారు మడులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగిలో డిసెంబరు, జనవరి నెలల్లో అధిక చలి ఉండడం వల్ల వరి పంటలో అన్ని సమస్యలు తలెత్తుతాయని, ముఖ్యంగా ఎండటం, చనిపోవడం, నారు ఎదగకపోవడం, జింకు దాతులోపం కాండంతో ఉధృతి వంటి ప్రధాన సమస్యలు నారుమడిలో గుర్తించవచ్చని, ఈ సమస్యలను అధిగమించడానికి సస్యరక్షణ చర్యలు పాటించాలని తెలిపారు. చలికి తట్టుకునే వరి రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. రాత్రి వేళలో చలి ఉధృతి ఎక్కువగా ఉండటం వల్ల వరి నారుమడిపై పాలిథిన్ షీట్ లేదా టార్పాటిన్లను, ప్లాస్టిక్ సంచులతో కుట్టిన పట్టాలను కప్పి మరుసటి రోజు ఉదయాన్నే తీసివేయాలని పేర్కొన్నారు. రాత్రిపూట నారుమడిలో నీరు లేకుంటే చలి ప్రభావం మొక్కలపై తక్కువగా ఉంటుంది కాబట్టి ప్రతిరోజు ఉదయం నీటిని పెట్టి సాయంత్రం తీసివేయాలన్నారు. నారు దశ నుంచి తగు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, నారు తీయడానికి వారం రోజుల ముందు రెండు గుంటల నారుమడికి 800 గ్రాముల కర్బోఫ్యూరాన్ 3జి గుళికలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు విష్ణు, రజనీకాంత్, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో రైతులకు సన్మానం

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 23 (ప్రభాతవార్త):** జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సోమవారం గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో రైతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, డైరెక్టర్లు నరసింహారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, యాదమ్మ, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, శివారెడ్డి, అజ్గర్, బాలు, బాలాగౌడ్, గణేష్, జమీర్‌బేగ్, అరుణ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.


రైతులను సన్మానిస్తున్న ఏఎంసి చైర్మన్ నరేందర్‌రెడ్డి

## ఘనంగా శ్రీవేంకటేశ్వరస్వామి ధనుర్మాసోత్సవాలు

**రామాయంపేట, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
రామాయంపేట మండల కేంద్రంలోని శ్రీపద్మావతి గోదాసమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాసం ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం 8వరోజు ధనుర్మాసం సందర్భంగా స్వామివారికి విశేషపూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీపద్మావతి గోదాసమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవవిగ్రహాలకు పల్లకీసేవాకార్యక్రమం నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాల సమయంలో భక్తులు పెద్ద ఎత్తున పల్లకీసేవలో పాల్గొని స్వామివారికి భక్తిగీతాలు, భజనకీర్తనలతో పల్లకీసేవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయప్రాంగణంలోని స్వామివారి విగ్రహానికి అభిషేకాలు, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. నెలరోజుల పాటు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు, కమిటీ అధ్యక్షులు తోట లక్ష్మీపతి, కోవూరు లక్ష్మణ్ తెలిపారు.

## సిసిరోడ్డు నిర్మాణానికి రోడ్డు చదును



సిసిరోడ్డుకు స్థలాన్ని చదును చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్

**నారాయణఖేడ్ టౌన్, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
పట్టణంలోని మంగల్‌పేట్‌లో సిసిరోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ శెట్కార్, వైస్‌చైర్మన్ దారం శంకర్‌లు సోమవారం రోడ్డును చదును చేయించి మార్కింగ్‌ను పర్యవేక్షించారు. ఈసందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్‌లు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో మురుగుకాల్వల నిర్మాణం పనులు, సిసిరోడ్డు నిర్మాణం పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

## చట్టానికి ఎవరూ చుట్టం కాదు



విలేకరులతో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆనంద్‌స్వరూప్ శెట్కార్

**నారాయణఖేడ్ టౌన్, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
హైద్రాబాద్‌లోని సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటనలో సినీ హీరో అల్లుఅర్జున్ తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని, చట్టం ఎవరికీ చుట్టం కాదని, చట్టంముందు అందరూ సమానమేనని మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ శెట్కార్ అన్నారు. సోమవారం పట్టణంలో తనను కలిసిన విలేకరులతో ఆనంద్‌స్వరూప్ శెట్కార్ మాట్లాడుతూ అల్లుఅర్జున్ ఇంటికి క్యూ కట్టిన సెలబ్రిటీలు, ఆసుపత్రిలో చికిత్స అందుకుంటున్న బాలుడిని పరామర్శించిన పాపాన పోలేదని ఆందోళన వ్యక్తంచేశారు. అల్లుఅర్జున్ వ్యవహార శైలి దారుణంగా ఉందని, పశ్చాత్తాపం కనిపించడంలేదని విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వం తనపై తప్పుడుప్రచారం చేస్తోందని అల్లుఅర్జున్ పత్రికలకు, టివి ఛానల్‌లకు ఎక్కడం సరికాదని సూచించారు.

## అమిత్‌షా దిష్టిబొమ్మ దగ్ధం



కేంద్రమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దగ్ధంచేస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

**పుల్‌కల్, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
పార్లమెంట్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలుచేసిన కేంద్ర హోంశాఖామంత్రి అమిత్‌షా తన మంత్రిపదవికి రాజీనామాచేసి దళితులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్‌చేస్తూ సోమవారం అంబేద్కర్ సంఘం నాయకులు మండలపరిధిలోని బస్వాపూర్ మోడల్‌స్కూల్ చౌరస్తాలో నిరసన వ్యక్తంచేస్తూ దిష్టిబొమ్మను దగ్ధంచేశారు. ఈసందర్భంగా మండల అంబేద్కర్‌సంఘం నాయకులు మాట్లాడుతూ అమిత్‌షా వాఖ్యలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మౌనం వీడాలని డిమాండ్‌చేశారు. అమిత్‌షా క్షమాపణలు చెప్పి తన పదవికి రాజీనామా చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా అంబేద్కర్ వాదులందరినీ ఏకంచేసి ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అంబేద్కర్‌సంఘం సభ్యులు తలారి అంజయ్య, మ్యాతరి పోచయ్య, మేతరి శ్రీను, మధుసూదన్, శ్యాంసుందర్, కరుణాకర్, లడ్డు, రజిని, శ్రీకాంత్, వినయ్, మధు, నిఖిల్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## వరికొయ్యలను తగలబెడితే భూసారం క్షీణిస్తుంది



పొలంలో వరికొయ్యలను తగలబెడుతున్న దృశ్యం

**పుల్‌కల్, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
వరికొయ్యలను వ్యవసాయ పొలంలో నిప్పుపెట్టి కాల్చివేస్తే భూసారం క్షీణిస్తుందని మండల వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నా, ప్రయోజనం లేకుండాపోతోంది. రైతులు పంటలసాగుకు రసాయన ఎరువులు వినియోగిస్తుండటంతో కొంతమేర భూసారం తగ్గిందని చెప్పవచ్చు. పుండు మీద కారం చల్లిన చందంగా రసాయన ఎరువుల వాడకంతో పాటు వరికొయ్యలను కాల్చేస్తుండటంతో భూసారం తగ్గి పంట దిగుబడులు గణనీయంగా తగ్గిపోతున్నాయి. వరికొయ్యలను కాల్చేస్తుండటంతో వస్తున్న పొగ మూలంగా ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటాయాని, వాతావరణం కలుషితం అవుతుందని అధికారులు సూచిస్తున్నారు. వరికొయ్యను భూమిలోనే కాల్చేయడంతో వ్యవసాయం పలు సంవత్సరాల వెనుకకు పోతుందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వరికొయ్యలను భూమిని దున్నే తరుణంలో సింగిల్ సూపర్ ఫాస్పేట్ కలిపి, చల్లి, దున్నడంతో అవి భూమిలో కలిసిపోతాయని, భూసారం పెరిగి పంట దిగుబడులు పెరుగుతాయంటున్నారు. ఏడిఏ చైతన్య, ఏఈఓ ప్రవీణలు గ్రామాల్లోని రైతులకు వరికొయ్యలను కాల్చేయవద్దని, వరికొయ్యలను భూమిలో కాల్చేయడంతో కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించి ఉన్నారు. రైతులు వ్యవసాయ అధికారులు సూచనలు పాటిస్తూ, పంటలను సాగుచేస్తే అధిక దిగుబడులు వస్తాయని చెప్పడం అతిశయోక్తి కాదు.

# ఉపాధి పనుల్లో అవినీతి..ఫీల్డ్ అసిస్టెంట్ల మాయాజాలం

## -సామాజిక తనిఖీలో పనులకు, బిల్లులకు తేడా..



టేక్మాల్‌లో సామాజిక తనిఖీ బృందం, ప్రజా వేదికలో నిర్వహిస్తున్న దృశ్యం

**టేక్మాల్, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
రైతుకూలీలు వలసలు పోకుండా ఉండేందుకు ప్రభుత్వం పనులు కల్పించి ఉపాధి చూపేందుకు జాతీయ ఉపాధి హామీపథకం ఏర్పాటుచేసి పనులు కల్పించింది. దీంతో కూలీలకు జీవనోపాధి లభించి వలసలు తగ్గుముఖం పట్టాయి. అయితే అక్రమార్కులకు ఇదే అవకాశం లభించినట్లయింది. సామాజిక తనిఖీలలో వారి బండారం బట్టబయలు అవుతున్నా వారు ఏమాత్రం లెక్క చేయడంలేదు. పనులులేక ఖాళీగా ఉండే రైతుకూలీలకు ప్రభుత్వం ఉపాధి హామీపథకం ఏర్పాటుచేసి పనులు కల్పించింది. సామాజిక తనిఖీ ప్రజావేదిక టేక్మాల్ రైతువేదిక ఆవరణలో ఎంపిడివో విట్టల్ అధ్యక్షతన జరిగింది. ఈకార్యక్రమంలో మండలంలో జరిగిన అవినీతి గురించి విచారణ బృందం వెల్లడించింది. సంతకాలు లేకుండానే వారికి వేతనాలు వేశారని, పనులు చేయకుండానే కొందరి పేర్లపై డబ్బులు వేశారని తనిఖీబృందం తేల్చిచెప్పింది. ఈపనులకు సంబంధించి సామాజిక తనిఖీబృందం టేక్మాల్ మండలపరిధిలోని 29 పంచాయతీలున్నాయని, ప్రతి పంచాయతీలో అవినీతి జరిగినట్లు నిర్ధారించింది. పనులు చేసిన కూలీల సంఖ్యకు, మస్టర్లకు తేడాలు ఉన్నాయని తేల్చారు. పనులుచేశాక ఇచ్చిన కొలతలకు, సామాజిక తనిఖీలో వెల్లడి అయిన కొలతలకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది. ఈ విషయాలను తనిఖీబృందాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజావేదిక సాక్షిగా ఉపాధి హామీపథకం సిబ్బంది అవినీతిని ఎండగట్టారు. ప్రధానంగా మిగిలిన పంచాయతీలలో సైతం సిబ్బంది చేతివాటం ప్రదర్శించినట్లు తేల్చారు. అవినీతికి పాల్పడిన వారందరికి నోటీసులు జారీ చేశారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అవినీతి జరిగిందని, వారి చేతివాటం ప్రదర్శించారని ఆరోపణలు వచ్చాయి. ఈకార్యక్రమంలో అడిషనల్ పిడి రంగాచార్యులు, జిల్లావిజిలెన్స్ అధికారి శ్రీహరి, హెచ్‌ఆర్ మేనేజర్ రాజేందర్ రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారి జ్యోతి, ఎంఆర్‌పి రవి, ఎంపిడివో విటల్, పంచాయతీరాజ్ ఎఈ గోపాల్, ఎంపీ ఈవో రియాజోద్దీన్, ఎపిఓ పోలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## జడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులను నియమించాలి



ఎంఈఓకు వినతిపత్రం అందచేస్తున్న పోషకులు

**అల్లాదుర్గం, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని ముస్లాపూర్‌గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో 119విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారని పాఠశాల పోషకులు విచారం వ్యక్తంచేశారు. సోమవారం మండల విద్యాధికారి ధనంజయకు పోషకులు వినతిపత్రం అందేశారు. ఈసందర్భంగా పోషకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల కొరతతో విద్యాప్రమాణాలు దిగజారుతున్నాయన్నారు. ఉపాధ్యాయులు లేక తమచిన్నారుల భవిష్యత్తు బూడిదలో పోసిన పన్నీరులా మారుతుందని భయాందోళన వ్యక్తంచేశారు. 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్నా ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు ఉపాధ్యాయులను నియమించకపోవడం విడ్డూరంగా ఉందని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వెంటనే పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని వారు డిమాండ్‌చేశారు.

## సిఎం కప్-24లో మంజీరా విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

**రామాయంపేట మున్సిపాలిటీ, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
సిఎం కప్-24 జిల్లాస్థాయి క్రీడాపోటీలలో రామాయంపేట మంజీరా విద్యాలయం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. జిల్లాస్థాయి పోటీలలో విజయంసాధించి ఏకంగా రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి, వాసవి తెలిపారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న సిఎం కప్-24 పోటీలలో రామాయంపేట మండలస్థాయిలో నెగ్గి, జిల్లాస్థాయికి ఎంపికయిన మంజీరావిద్యాలయం విద్యార్థులు యోగా, సైక్లింగ్, బ్యాడ్మింటన్ విభాగాల్లో అత్యుత్తమప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన వారిలో జి.ధరణి (యోగా, బ్యాడ్మింటన్, సైక్లింగ్), బి.శివాని (సైక్లింగ్), బి.వేద (సైక్లింగ్), బి.సాయికృష్ణ (సైక్లింగ్) విభాగాల్లో రాణించి, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్, ఉపాధ్యాయ బృందం విద్యార్థినీవిద్యార్థులను అభినందించారు.

## పట్టణాభివృద్ధికి రూ.100కోట్ల నిధులు ఇవ్వాలి

**మెదక్ మున్సిపాలిటీ, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
ఈనెల 25వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వందసంవత్సరాల మెదక్‌చర్చి సంబరాలకు విచ్చేస్తున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మెదక్‌పట్టణాభివృద్ధి కోసం 100కోట్ల రూపాయల నిధులు ఇవ్వాలని ఐదవవార్డ్ కౌన్సిలర్, మెదక్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు కోరారు. గతముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఎన్నికల సందర్భంగా మెదక్‌పట్టణానికి ఇచ్చిన స్పెషల్ డెవలప్‌మెంట్ 50కోట్ల రూపాయలు టియుఎఫ్‌ఐడిసి గ్రాంటులో మరో 20కోట్ల రూపాయలు ఇచ్చినందున ఎన్నికల్లో బిఆర్‌ఎస్ ప్రభుత్వం రాకపోవడంతో ఈ ప్రభుత్వం ఆనిధులను రద్దుచేయడం జరిగిందని, కావున మెదక్‌పట్టణానికి విచ్చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెదక్ పట్టణాభివృద్ధిపై, మెదక్ ప్రజలపై ప్రత్యేకశ్రద్ధ చూపించి 100కోట్ల రూపాయలు పట్టణాభివృద్ధికి ఇవ్వాలన్నారు. మెదక్‌పట్టణ ప్రజలు చిరకాలకోరిక అయిన ఔటర్ రింగ్‌రోడ్డు కోసం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ఇవ్వాలని మెదక్‌పట్టణ ప్రజలపక్షాన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులను కోరుతున్నామన్నారు. ముఖ్యమంత్రిని కలిసే అవకాశాన్ని కల్పిస్తే రాష్ట్ర ముఖ్యమంత్రికి మెదక్ అభివృద్ధి కోసం, నిధుల కోసం వినతిపత్రాన్ని సమర్పిస్తామన్నారు.

## ఘనంగా గణితశాస్త్ర దినోత్సవం



విద్యార్థులు తయారుచేసిన గణితశాస్త్రానికి సంబంధించిన ఎగ్జిబిషన్

**రామాయంపేట మున్సిపాలిటీ, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
రామాయంపేట మండలం కోనాపూర్ జిల్లాపరిషత్ ప్రభుత్వపాఠశాలలో విద్యార్థులు గణితశాస్త్ర దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గణితశాస్త్రానికి సంబంధించిన వస్తువులను ఒకచోట చేర్చి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు తయారుచేసిన వస్తువులు చూపరులను ఎంతో ఆకర్షించాయి. ఈకార్యక్రమానికి మండల విద్యాధికారి మరియు గెజిటెడ్ ప్రాధాన్య ఉపాధ్యాయులైన శ్రీనివాస్, గణిత ఉపాధ్యాయులు శివరాజయ్య, ఇతర ఉపాధ్యాయులు మహేందర్, రమేష్, భాగ్యలక్ష్మి, మన్నె వెంకటస్వామి తదితరులు పాల్గొని, ఎగ్జిబిషన్‌ను తిలకించారు. గణితశాస్త్రానికి సంబంధించిన వస్తువులను ఎంతో చక్కగా తయారుచేసిన విద్యార్థులను అభినందించారు. అనంతరం మండల విద్యాధికారి అయిత శ్రీనివాస్ గణితశాస్త్రానికి సంబంధించిన సందేశాన్ని ఇవ్వడం జరిగింది.

## ఎక్సైజ్ కార్యాలయం ముందు ధర్నా



ఎక్సైజ్ కార్యాలయం ముందు ధర్నాచేస్తున్న దళితసంఘాల నాయకులు

**జోగిపేట, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
గ్రామాల్లో బెల్టుషాపులను నియంత్రించాలంటూ దళితసంఘాల ఆధ్వర్యంలో మహిళలతో కలిసి జోగిపేట ఎక్సైజ్‌శాఖ కార్యాలయం ముందర సోమవారం ధర్నా నిర్వహించారు. గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటికి కొరత ఉంది కానీ మద్యానికి మాత్రం ఏలాంటి కొరతలేదని, అన్నిరకాల మద్యం గ్రామాల్లో అందుబాటులో ఉంటుందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామాల్లో మద్యం అందుబాటులో ఉంటుండటంతో గొడవలకు దారితీస్తున్నాయని తెలిపారు. గ్రామాల్లో బెల్టుషాపులను తొలగించాలని ఎక్సైజ్ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోతుందని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు అందోలు మల్లేశం ఆరోపించారు. మద్యం సిండికేట్ కనుసన్నల్లో ఎక్సైజ్‌శాఖ అధికారులు పనిచేస్తున్నారని విమర్శించారు. గ్రామాల్లో బెల్టుషాపులను అరికట్టకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈధర్నాలో దళితసంఘాల నాయకులు బహుజన ప్రసాద్, పెండగోపాల్, జంగం మహేష్, శ్రీలత, నిర్మల, దుర్గమ్మ, రత్నకళ తదితరులు పాల్గొన్నారు.

## ఆపన్నహస్తం సిఎం సహాయనిధి పథకం

**-కాంగ్రెస్ పార్టీ కొల్చారం మండల అధ్యక్షుడు నాగులగారి మల్లేశం గౌడ్**

**కొల్చారం, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
ఆపదలో ఆపన్న హస్తం సిఎం సహాయనిధి పథకం అని కాంగ్రెస్ పార్టీ కొల్చారం మండల అధ్యక్షుడు నాగులగారి మల్లేశంగౌడ్ అన్నారు. కొల్చారం మండలానికి మంజూరైన ఏడుమంది లబ్ధిదారులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం నర్సాపూర్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించడం జరిగింది. ఇందులో సుమారుగా రూ.1,50,000 విలువగల చెక్కులను చిన్న ఘనపూర్‌లో ముగ్గురు, వరిగుంతంలో ఒకరు, రాంపూర్‌లో ఒకరు, కొల్చారం మండల కేంద్రం గ్రామానికి ఇద్దరు లబ్ధిదారులకు చెక్కులు అందించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు దేవన్నగారి శేఖర్, మహేశ్వర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఆశన్నగారి శ్రీశైలం, గోవర్ధన్, శ్రీనివాస్ రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షా రాజీనామా చేయాలి

## -విలేకరుల సమావేశంలో ఎంపి సురేశ్‌కుమార్ శెట్కార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి సురేశ్‌కుమార్ శెట్కార్

జహీరాబాద్, డిసెంబరు 23, ప్రభాతవార్త: భారతీ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానించి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామ చేయాలని ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎంపి సురేశ్‌కుమార్ శెట్కార్ మాట్లాడుతూ హోం శాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో అంబేద్కర్‌పై అనుచిత వాఖ్యలు చేయడంతో దళితుల , దేశ ప్రజల మనోబావాలు దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అమిత్‌షా తన వాఖ్యలను వెనక్కు తీసకుని దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పే వరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. మంగళవారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అమిత్ షా వాఖ్యలకు నిరసనగా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో టిఎస్‌ఐఐసి మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కండెం నర్సింలు, జహీరాబాద్, కోహీర్, న్యాల్‌కల్, మగుడంపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి నరసింహారెడ్డి, హనుమంతరావు పాటిల్,రామలింగారెడ్డి, బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, మక్సుద్, మాజీ మున్సిపల్ చైర్మన్ మంకాల్ సుభాష్, నాయకులు శుక్లవర్ధన్‌రెడ్డి, అశోక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## యూనిట్ పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తా

**-యూనిట్ అల్లాదుర్గం అధ్యక్షులు శంకర్**

**అల్లాదుర్గం, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
పంచాయతీరాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ యూనిట్ పరిధిలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని అల్లాదుర్గం యూనిట్ అధ్యక్షులు శంకర్ అన్నారు. సోమవారం అల్లాదుర్గం యూనిట్ వార్షిక సమావేశం మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ అధ్యక్షులు శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన డిఎలు, మెరుగైన పిఆర్సి ఇవ్వాలని, యూనిట్ పరిధిలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో పంచాయితీరాజ్ మినిస్ట్రీ రియల్ జిల్లా అధ్యక్షులు మాధవచారి, ఎంపిడిఓ ఎం చంద్రశేఖర్, రేగడ్ సూపరింటిడెంట్ షాకీర్ అలీ, రేగోడ్, ఆల్లాదుర్గం, పెద్ద శంకరంపేట సిబ్బంది చంద్రశేఖర్, రవీందర్, రాజిముద్దీన్, రాజుకుమార్, సర్దర్ తదితరులు పాల్గొన్నారు.

## దేశానికి రైతులు వెన్నెముకలు

**పుల్‌కల్, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
దేశానికి రైతులే వెన్నెవెముకలని లయన్స్ క్లబ్ జిల్లాచైర్మన్ లయన్ అనంతరావు కులకర్ణి అన్నారు. కిసాన్ దివస్ (మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ చౌదరి చరణ్‌సింగ్ జన్మదినం)ను పురస్కరించుకుని పుల్‌కల్ ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనంత్‌రావు కులకర్ణి సౌజన్యంతో రైతులను ఘనంగా సత్కరించి రైతు దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ లయన్ మంగళపర్తి వెంకటేశం, సిఈఓ పి.నాగయ్య, వైస్‌చైర్మన్ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

**-పుల్‌కల్ పాఠశాలలో వ్యాస రచన పోటీలు...**
రైతుదినోత్సవాన్ని పురస్కరించుకుని పుల్‌కల్‌లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రైతుదినోత్సవంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు నగదు బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ప్రకాష్, మల్లేశం, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాలనీల్లో మౌలికవసతుల కల్పనకు కృషి

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



శాంతినగర్, శ్రీనగర్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహీపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
పటాన్చెరు డివిజన్ పరిధిలోని కాలనీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయించడంతోపాటు, మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహీపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం డివిజన్ పరిధిలోని శాంతినగర్, శ్రీనగర్‌కాలనీలలో స్థానిక కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్, జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్‌తో కలిసి ఆయన పర్యటించారు. ఈసందర్భంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు నిర్మించి చాలా ఏళ్లు గడిచిపోవడం మూలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు కాలనీవాసులు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జిఎంఆర్, అతిత్వరలో ప్రతిపాదనలు సిద్ధంచేసి పనులు చేపడతామని తెలిపారు. అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ విజయ్‌కుమార్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## అవతార్ మెహర్‌బాబా వార్షికోత్సవాలు

**రామాయంపేట, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
రామాయంపేట పట్టణంలో ఆదివారం అవతార్ మెహర్‌బాబా 32వ వార్షికోత్సవ వేడుకలను భక్తులు, ప్రేమికులు ఘనంగా జరుపుకున్నారు. అవతార్ మెహర్‌బాబా వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఇక్కడ నూతనంగా నిర్మించిన భవనాన్ని అందంగా తీర్చిదిద్దారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం ఐదుగంటల వరకు వివిధరకాల కార్యక్రమాలను బాబా ప్రేమికులు నిర్వహించారు. ముందుగా ప్రార్థనలు, హారతితో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆధ్యాత్మిక సార్వభౌముడైన మెహర్ ప్రభువుల సప్తవర్ణ పతాకావిష్కరణ కావించారు. ధునిప్రజ్వలన, సనాతనుని కీర్తనలు చేశారు. ఉభయ తెలుగురాష్ట్రాల అధ్యక్షుడు రామకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రం నుండి ఎంతోమంది బాబాప్రేమికులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈకార్యక్రమంలో బాబాప్రేమికులు ఇందూరి రామాగౌడ్, బచ్చు ప్రభాకర్, కొక్కొండ రామచంద్రం, ఏలూరి రవీందర్, బాలరాజు, రేషన్‌డీలర్ తోట శ్రీనివాస్, తోట లక్ష్మీపతి, బట్టు విద్యాకర్ రాజు, ఎనిశెట్టి అశోక్, పబ్బ వెంకటేశం, మంగళి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద వధువుకు పుస్తెమట్టెలు అందజేత

**రామాయంపేట, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
రామాయంపేట మండలకేంద్రంలో నిరుపేదవధువు వివాహానికి ప్రముఖ సంఘసేవకులు ఎర్రం నాగలక్ష్మి ఆంజనేయ దంపతులు పుస్తె మట్టెలు అందజేశారు. గ్రామానికిచెందిన రమాగంగారం దంపతుల పుత్రిక ప్రణవి వివాహానికి పుస్తె,మట్టెలు అందజేసి వారికి అండగా నిలిచారు. ఈసందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ నిరుపేదలకు ఎల్లవేళలా అండగా ఉంటానని అన్నారు. ఇప్పటివరకు 117మంది జంటలకు పుస్తె,మట్టెలు అందించినట్లు ఆయన తెలిపారు ఈకార్యక్రమంలో ఎర్రగొల్ల రమేష్ యాదవ్, కర్రె నరేందర్, మున్నూరు యాదగిరి, పోచమ్మల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చెక్కు అందజేత

**చిన్నశంకరంపేట, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
మండలపరిధి చందంపేట గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సెక్రటరీగా పనిచేసిన పటేల్ విజయ్‌కుమార్ సంవత్సరం క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. సోమవారం భార్య మహేశ్వరికి రూ.2,39,608 రుపాయల చెక్కును చైర్మన్ సత్యనారాయణ అందించారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్లు పోచాగౌడ్, రామక్రిష్ణ, మాజీఎంపిటిసి శివకుమార్, సొసైటీ సిబ్బంది ఉన్నారు.

## ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

**చిన్నశంకరంపేట, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
విద్యుత్‌స్తంభానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిన్న శంకరంపేట మండలం మిర్జాపల్లిగ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం, మండలపరిధి మిర్జాపల్లి గ్రామానికి చెందిన సిద్దిరాములు (45) మద్యానికి బానిసై ఇంట్లో రోజూ గొడవపడుతుండేవాడు. ఆదివారం రాత్రి ఇంట్లో గొడవపడి ఇంట్లో నుండి వెళ్లిపోయాడు. ఉదయం లేచి చూసేసరికి ఇంటి ముందు ఉన్న విద్యుత్‌స్తంభానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునిభార్య రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## పాముకాటుతో మహిళ మృతి

**నాగల్‌గిద్ద, డిసెంబరు 23, ప్రభాతవార్త:**
పాముకాటుతో మహిళ మృతిచెందిన సంఘటన మండలపరిధిలోని కిషన్‌నాయక్‌తండాలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, తండావాసుల కథనం ప్రకారం...తండాకు చెందిన రాథోడ్ తేజుబాయి (40) ఇంట్లో ఉండగా పాముకాటుకు గురయింది. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే రాథోడ్ తేజుబాయి అనంతలోకాలకు చేరిపోయిందన్నారు. మృతురాలికి 4గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పేద కుటుంబం అయిన రాథోత్ తేజుబాయి కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని తండావాసులు వినతిచేశారు.